సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 27 । జనవరి । 2023



మహనీయులను స్మరించుకోవాలి

మహనీయులను నిత్యం స్మరించుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గణతంత్ర దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. - 8లో..

ఐపీఎస్ రాకేష్‌రెడ్డికి ప్రతిష్టాత్మక అవార్డు



మార్కాపురానికి చెందిన ఐపీఎస్ రాకేష్‌రెడ్డి వరుసగా రెండో ఏడాది కూడా అస్సాం ప్రభుత్వం జారీచేసిన ప్రతిష్టాత్మక అవార్డును కైవసం చేసుకున్నారు. గతేడాది అస్సాం డీజీపీ అవార్డు, ఈ ఏడాది అస్సాం శిశు మిత్ర అవార్డు దక్కించుకున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
32 /21

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొన్న మంత్రి సురేష్



జార్జి కళాశాలలో జెండా ఎగురవేస్తున్న మంత్రి సురేష్

మార్కాపురం: మహనీయుల త్యాగాలను ఎన్నటికీ మర్చిపోవద్దని రాష్ట్ర పురపాలక శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. గురువారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ జెండాను ఆయన ఎగురవేశారు. ప్రజల సంక్షేమం కోసం రాజ్యాంగాన్ని తయారు చేయడం జరిగిందన్నారు. ప్రతిఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డాక్టర్ సతీష్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజబాబు, డీన్ మస్తానయ్య, హెచ్‌వోడీలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల గౌరవ వందనాన్ని మంత్రి స్వీకరించారు.

అబ్బురపరిచిన బుడతలు



అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు టౌన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని పోలీస్ పరేడ్ మైదానంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో అంగన్‌వాడీ చిన్నారులు అనర్గళంగా ఇంగ్లిష్‌లో మాట్లాడి అబ్బురపరిచారు. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికా గర్గ్ సందర్శిస్తూ స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ స్టాల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ఒంగోలు నగరం సోనియాగాంధీ నగర్ అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌కు చెందిన చిన్నారులు బాపూజీ మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, మదర్ థెరిస్సా, ఇతర మహనీయుల గురించి ఇంగ్లిష్‌లో వివరించి అబ్బురపరిచారు. అంబేద్కర్ గురించి డి.అరుష్, గాంధీజీ గురించి ఎస్.ప్రాఖ్య, మదర్ థెరిస్సా గురించి పి.హన్న జాయస్, జవహర్‌లాల్ నెహ్రూ గురించి బి.అభినాష్ మాట్లాడారు. ఆ బుడతలు మాట్లాడుతున్న తీరు చూసి కలెక్టర్, ఎస్పీతో పాటు అక్కడున్న వివిధ విభాగాల అధికారులు ఆశ్చర్యపోయారు. ఇంగ్లిష్‌లో మాట్లాడిన చిన్నారులను కలెక్టర్ దినేష్‌కుమార్ ఎత్తుకుని మురిసిపోయారు. వారిని తీర్చిదిద్దిన అంగనవాడీ టీచర్ నిర్మల జ్యోతిని కలెక్టర్ అభినందించారు.

రేపు రథసప్తమి

ఒంగోలు టౌన్: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి, శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానాలలో శనివారం సప్త వామన సేవలు నిర్వహించనున్నట్లు ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాదబాబు, పుచ్చకాయల గోవర్దనరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మేయర్ గంగాడ సుజాత తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఉదయం 6 గంటలకు సూర్యప్రభ, 9 గంటలకు శేషవాహనం, 10 గంటలకు గరుడ వాహనం, మధ్యాహ్నం 1.30 గంటలకు హనుమంత వాహనం, 3 గంటలకు చక్ర స్నానం, 4 గంటలకు గజ వాహనం, 5 గంటలకు అశ్వ వాహనం, 6.30కు చంద్రప్రభ వాహనం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

నవరత్నాలతో

సంక్షేమ రాజ్యం

- జిల్లాలో పుష్కలంగా సహజ వనరులు
- సమృద్ధిగా సాగర్ జలాలు
- పరిశ్రమల స్థాపన ద్వారా మెండుగా ఉపాధి అవకాశాలు
- నవరత్నాల ద్వారా సంక్షేమ ఫలాలు
- 1,25,588 మందికి ఇళ్ల స్థలాలు
- చకచకా వెలిగొండ నిర్మాణ పనులు
- ఘనంగా 74వ గణతంత్ర వేడుకలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: నవరత్నాలతో పేదలకు పెద్ద ఎత్తున సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం 74వ గణతంత్ర దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మలికాగర్గ్, జేసీ అభిషిక్త్‌కిషోర్‌తో కలిసి జాతీయ జెండాను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జిల్లా సమగ్రంగా అభివృద్ధి చెందుతోందన్నారు. జిల్లాలో పుష్కలంగా ఉన్న సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగిపోతున్నామన్నారు. సాగర్ జలాలతో ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు సమృద్ధిగా పంటలు సాగుచేసుకుంటున్నారన్నారు. నూతన జిల్లాలో 38 మండలాల్లో 719 గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయని వివరించారు. సచివాలయాల్లో 6,797 మంది సిబ్బంది ద్వారా ప్రభుత్వ సేవలను అందిస్తున్నామన్నారు. 2022–23 సంవత్సరంలో ఏపీ సేవా సర్వీసెస్ కింద 14,33,378 సేవా వినతులను పరిష్కరించామన్నారు. ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసి 12,019 అప్లికేషన్లను పరిష్కరించామని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లో 61 పులులు ఉన్నాయన్నారు. మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఎన్‌ఎస్పీ నుంచి వస్తున్న సాగర్ జలాలు, 798 సాగునీటి చెరువుల ద్వారా లక్షల ఎకరాల్లో పుష్కలంగా పంటలు పండుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని గ్రానైట్ నిక్షేపాల ద్వారా, క్వార్ట్జ్ ఉత్పత్తి ద్వారా 59,420 మందికి ఉపాధి కలగడమే కాకుండా రూ.292.73 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరిందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.8,052 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.5,945 కోట్లు ఖర్చు చేశామన్నారు. వైఎస్సార్ జలకళ ద్వారా 2,823 బోర్లు మంజూరు చేసి రూ.11.17 కోట్లు వెచ్చించామని, వీటి ద్వారా 5,740 మంది రైతులకు లబ్ధిచేకూరిందని అన్నారు. 1,72,852 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు 537 ఎలక్ట్రికల్ ఫీడర్ల ద్వారా పగటిపూట 9 గంటల విద్యుత్‌ను నిరంతరాయంగా ఇస్తున్నామన్నారు. 616 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నిరంతరం అన్ని సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

ఉద్యానవన పంటలను కూడా ప్రోత్సహిస్తున్నామని, అందుకుగానూ రైతులకు రూ.18.41 కోట్లు అందించామని కలెక్టర్ వెల్లడించారు. 2022–23 సంవత్సరానికి 16 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలకు రూ.196.30 కోట్లు వెచ్చించి డ్రిప్, స్ప్రింక్లర్లు అందిస్తున్నామన్నారు. జగనన్న పాల వెల్లువలో భాగంగా 160 పాల కేంద్రాల ద్వారా ప్రతిరోజూ 20 వేలకుపైగా పాల సేకరణ జరుగుతోందన్నారు. అందుకుగానూ ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.46.70 కోట్లు జమ చేశామన్నారు. ఫిష్ ఆంధ్ర కార్యక్రమాన్ని విస్తృతంగా జిల్లాలో అమలు చేస్తున్నామన్నారు. కొత్తపట్నం వద్ద ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ 549 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా 119 గ్రామాల్లో రీ సర్వే జరుగుతోందన్నారు. జిల్లాలోని 25 ప్రధాన పరిశ్రమలు, 2,899 ఎంఎస్ఎంఈలు, ఇతర పరిశ్రమల ద్వారా 65,294 మందికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌ను మార్గదర్శిని కార్యక్రమం ద్వారా అందిస్తున్నామని తెలిపారు. ఫలితంగా 592 విద్యా సంస్థల నుంచి 52,361 మందికి ప్రయోజనం చేకూరుతోందన్నారు. జిల్లాలోని యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో 1.76 కోట్ల పనిదినాలు కల్పిస్తున్నామని తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా జిల్లాలోని 99,206 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 61,681 కనెక్షన్లు ఇచ్చామని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టును వనరుగా చేసుకుని పశ్చిమ ప్రకాశంలో రూ.1,290 కోట్లతో 21 మండలాల్లో 1,067 ఆవాసాలకు ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా 1,579.55 ఎకరాల్లో 1,25,588 మంది ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాలు అందించామన్నారు. 1,004 జగనన్న లే అవుట్లలో భూమి చదును చేసి 82,755 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. 6,59,576 బీపీఎల్ కుటుంబాలకు నాణ్యమైన బియ్యం, చక్కెర, కందిపప్పులాంటి నిత్యావసర సరుకులను 385 మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల ద్వారా ప్రతి నెలా అందిస్తున్నామని కలెక్టర్ దినేష్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి భారతి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంఎల్‌సీ తూమాటి మాధవరావు, ఎమ్మెల్యే సుధాకర్‌బాబు, నగర మేయర్ గంగాడ సుజాత, వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు.





జాతీయ జెండా ఎగురవేసి వందనం చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్, జేసీ అభిషిక్త్ కిషోర్, (ఇన్‌సెట్లో) ప్రసంగిస్తున్న కలెక్టర్

నవరత్న పథకాల ద్వారా చేకూరిన లబ్ధి ఇలా...

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	చేకూరిన లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్సార్ రైతు భరోసా	2,18,612	324.00
వైఎస్సార్ పెన్షన్ కానుక	2,86,075	715.20
వైఎస్సార్ సున్నా వడ్డీ	13,457	4.03
వైఎస్సార్ చేయూత	82,724	155.10
వైఎస్సార్ ఆసరా	3,08,052	234.05
వైఎస్సార్ వాహనమిత్ర	10,176	10.18
వైఎస్సార్ నేతన్న నేస్తం	667	1.60
వైఎస్సార్ కాపు నేస్తం	12,613	18.92
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	37,973	99.00
జగనన్న విద్యా కానుక	3,36,196	----
జగనన్న వసతి దీవెన	53,953	52.05
జగనన్న విద్యా దీవెన	55,646	34.98
వైఎస్సార్ మత్స్యకార భరోసా	5,286	5.28
జగనన్న అమ్మ ఒడి	2,09,776	314.66
జగనన్న తోడు	1,69,069	169.07



జాతీయ పతాకంతో జవహర్ నవోదయ విద్యార్థిని



వైఎస్సార్ పెన్షన్ కానుక, చేయూత మహిళా మార్ట్ శకటం



జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శకటం



గృహ నిర్మాణ సంస్థ శకటం



డ్వామా..



రెవెన్యూ, సర్వే అండ్ సెటిల్‌మెంట్ శాఖల శకటం



డ్రోన్ ప్రదర్శన



వైద్యారోగ్య శాఖ...



వ్యవసాయ, ఉద్యానవన శాఖల శకటం



గౌరవ వందన స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్పీ



డ్యాన్స్ చేస్తున్న డ్రీమ్స్ స్కూల్ విద్యార్థినులు



వేడుకలను తిలకిస్తున్న బాలినేని, బూచేపల్లి, మాగుంట, టీజేఆర్, తూమాటి



జానపద గీతానికి నృత్యం చేస్తున్న మార్కాపురం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు



గిరిజన సంప్రదాయ నృత్యం చేస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థినులు



ఎడ్ల బండిపై చిరుధాన్యాల ప్రదర్శన



వ్యవసాయ యంత్రం ప్రదర్శన

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతూ మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా అడుగులు వేస్తున్నామని ఒంగోలు నగర కమిషనర్ ముప్పూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. 74వ గణతంత్ర దిన వేడుకలను పురస్కరించుకుని స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో గురువారం వేడుకలు నిర్వహించారు. కమిషనర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి హాజరయ్యారు. జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఒంగోలు నగర ప్రజలకు శాశ్వతంగా మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. అందులో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి శాశ్వతంగా రూ.339 కోట్ల నిధులు మంజూరు చేయించారని తెలిపారు. అదేవిధంగా నగరంలోని నిరుపేదలు 25 వేల మందికి ఇళ్ల స్థల పట్టాలివ్వడానికి ప్రైవేటు భూముల పరిశీలన చివరి దశకు చేరిందన్నారు. భూములు కొనుగోలు చేసైనా సరే సొంతిళ్లు లేని పేదలకు పట్టాలు ఇప్పించాలన్న బలమైన నిర్ణయంతో బాలినేని ఉన్నారని గుర్తు చేశారు. అందుకోసం రూ.200 కోట్లను భూముల కొనుగోలుకు కేటాయించారని తెలిపారు. అమృత్ పథకం ద్వారా నగర ప్రజలకు మంచినీరు అందించేందుకు రూ.123 కోట్లతో నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. మొత్తం మీద 75 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. నగరంలో అంతర్గత రోడ్లు, విలీన గ్రామాలను కలుపుతూ రూ.11.60 కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే నగరంలో మురుగు కాలువల నిర్మాణాలు సాగుతున్నాయని, మరో రూ.10 కోట్లకు టెండర్లు పిలిచామని అన్నారు. గ్రీన్ సిటీ చాలెంజ్–జగనన్న హరిత నగరాల్లో భాగంగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోటితో పనులు చేపట్టనున్నామన్నారు. సంఘమిత్ర వైద్యశాల నుంచి పాత గుంటూరు రోడ్డులోని అగ్రికల్చర్ మార్కెట్ యార్డు వరకు పాత బైపాస్ రోడ్డు సెంట్రల్ మీడియన్స్, గ్రీన్ బెల్ట్ వేయడానికి రూ.40 లక్షలు, పార్కుల అభివృద్ధికి రూ.75 లక్షలు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. మరో రూ.47 లక్షలతో రోడ్లకు ఇరువైపులా చెట్లు నాటించే కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టామన్నారు. జగనన్న స్మార్ట్ స్ట్రీట్స్‌లో భాగంగా రూ.1.80 కోట్లతో అభివృద్ధి చేపట్టనున్నామని వెల్లడించారు. తాగునీటి చెరువుల అభివృద్ధికి మొత్తం రూ.5.70 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపామన్నారు. పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణకు నగరంలో మూడు బుట్టల పంపిణీ చేపట్టామని, క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా చెత్త సేకరణ కోసం 60 ఆటోలు ఏర్పాటు చేశామని కమిషనర్ చెప్పారు. వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను అభివృద్ధి చేశామన్నారు. మన బడి, నాడు–నేడు కింద మొదటి విడతలో ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని 9 పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. రెండో విడతలో 12 పాఠశాలలను ఎంపిక చేసి అందుకోసం రూ.11.96 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని వివరించారు. ఒంగోలు నగర ప్రజలకు సంక్షేమ పథకాలు, నవరత్నాలు కలిపి 2022–23 ఆర్థిక సంవత్సరానికిగానూ మొత్తం 2,08,399 మంది లబ్ధిదారులకు నేరుగా డైరెక్ట్ బెనిఫిషియరీ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా రూ.,134 కోట్లు అందించటం జరిగిందన్నారు.



బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని, ఎంపీ మాగుంట, మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు

మహనీయుల త్యాగాల వల్లే స్వేచ్ఛగా జీవిస్తున్నాం : ఎమ్మెల్యే బాలినేని

స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాల వల్లే మనం ఈ రోజు స్వేచ్ఛగా జీవిస్తున్నామని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వారి పోరాటాలను ఏ ఒక్కరూ మరవకూడదని, బావితరాలకు వారి త్యాగాల గురించి చెబుతుండాలని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను ఎల్లప్పుడూ స్మరించుకోవాలన్నారు. ప్రజలందరూ ఎల్లవేళలా సంతోషంగా సుఖశాంతులతో జీవించాలని కోరుకుంటూ అందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్లు వెలనాటి మాధవరావు, వేమూరి సూర్యనారాయణ, ఎంఈ కే మాల్యాద్రి, ఏసీపీ కేవీ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ వెంకటేశ్వర్లుకు సన్మానం



కానిస్టేబుల్ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ఏపీ ఐటీ స్పెషల్ సెక్రటరీ డాక్టర్ సుందర్ బాలకృష్ణ

టంగుటూరు/ఒంగోలు టౌన్: గతేడాది మాండూస్ తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షంలో చప్టా దాటుతూ నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న వ్యక్తిని ప్రాణాలతో రక్షించిన టంగుటూరు కానిస్టేబుల్ డి.రాజవెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. విజయవాడలోని వీఐటీ–ఏపీ యూనివర్శిటీలో గురువారం జరిగిన గణతంత్ర వేడుకల్లో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ స్పెషల్ సెక్రటరీ డాక్టర్ సుందర్ బాలకృష్ణ కానిస్టేబుల్‌ను శాలువాతో సన్మానించి, ప్రశంసాపత్రం, రూ.20 వేల నగదు అందజేశారు. మాండూస్ తుఫాన్ ప్రభావంతో డిసెంబర్ 11న టంగుటూరు మండలంలోని ఎం.నిడమానూరు సమీపంలో ముసివాగు చప్టాపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండగా అదే గ్రామానికి చెందిన మార్నెళ్ల రమణయ్య అనే వ్యక్తి ఉప్పలపాడు నుంచి వస్తూ చప్టా దాటే ప్రయత్నంలో వరద ప్రవాహానికి కొట్టుకుపోయాడు, వెంటనే స్పందించిన కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు స్థానికుల సహకారంతో తాడులు వేసుకొని వాగులోకి దిగి రమణయ్య కోసం గాలించారు. ఓ చిల్లచెట్టు పట్టుకొని ఉన్న రమణయ్యను రక్షించి తీసుకువచ్చి వారి కుటుంబ సభ్యులకు

యువకుడి ఆత్మహత్య

ఒంగోలు టౌన్: నగరంలోని బత్తులవారి కుంటలో ఓ యువకుడు గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. పుల్లా సూర్య ప్రకాశరావు (20) గుడివాడలో పాలిటెక్నిక్ పరీక్షల్లో ఫెయిలయ్యాడు. ఈకారణంతోనే మనస్తాపం చెంది ఇంటి డాబా మీద ఉన్న గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని మరణించి ఉంటాడని కుటుంబ సభ్యులు చెప్తున్నారు. మరోపక్క మధ్యాహ్నం మైదానంలో క్రికెట్‌లో ఘర్షణ జరిగిందని ఈకారణం కూడా అయిఉంటుందని ప్రచారం జరుగుతోంది. తండ్రి రాఘవస్వామి అనంతపురంలో భవన నిర్మాణ పనులు చేయిస్తుంటారు. ఆయనకు సమాచారం అందించారు. తాలూకా ఎస్సై టి. రాజ్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సేవలకు సలాం

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో జిల్లాలో వివిధశాఖల్లో ప్రతిభ చాటిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎస్పీ మలికాగర్గ్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.


కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్, జేసీ అభిషిక్త్ కిషోర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్.సరళా వందనం (స్పెషల్ కలెక్టర్), వి.విశ్వేశ్వరరావు (ఆర్‌డీఓ, ఒంగోలు), ఎం.శ్రీదేవి (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్), ఎం.రజనీకుమారి (జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి), జి.అర్చన (విభిన్న ప్రతిభావంతులు,హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి), బి.శ్రీకృష్ణవేణి (డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్), టి.ఉషారాణి (జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి) కె.చిరంజీవి (తహసీల్దార్), సీహెచ్ నాగార్జునరెడ్డి (తహసీల్దార్), పీవీ ఉషారాణి (ఏపీసీపీడీసీఎల్, ఈఈ) ఎస్‌కే ఫజులుల్లా (చీమకుర్తి మున్సిపల్ కమిషనర్)


డి.ప్రత్యూష (ఉద్యానవన శాఖాధికారి), పి.శివరాకేష్ (104 జిల్లా మేనేజర్), డాక్టర్ బంకా రత్నం (మెడికల్ ఆఫీసర్), డాక్టర్ పి.ప్రవీణ్ (మెడికల్ ఆఫీసర్), డాక్టర్ ఎస్.వాణి (మెడికల్ ఆఫీసర్), డాక్టర్ సీహెచ్ చైతన్యదీపక్ (మెడికల్ ఆఫీసర్), డి.చినకొండయ్య (మెప్మా సీఎంఎం), జి.మురళీకృష్ణ(ఆర్ఐ, గనులశాఖ), ఎస్.జాన్ సుందరం (మైనార్టీ వెల్ఫేర్ సూపరింటెండెంట్, ఎం.ఉదయశ్రీ (అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి)


పి.ముత్యం (సబ్‌ట్రెజరీ ఆఫీసర్), ఎం.శ్రీమన్నారాయణ (జూనియర్ వెటర్నరీ ఆఫీసర్), డాక్టర్ ఆర్.రమేష్ (అసిస్టెంట్ డైరెక్టర్ పశుసంవర్ధకశాఖ), కేకే శ్రీనివాసన్ (ఈఈ, ఏపీ ట్రాన్స్‌కో), డాక్టర్ ఎస్.సూరిబాబు (జిల్లా వైద్యశాల కో ఆర్డినేటర్) ఎస్.ధనలక్ష్మమ్మ (ఇండస్ట్రియల్ ఫార్మేషన్ ఆఫీసర్), జి.థామస్ (ఇండస్ట్రియల్ ఫార్మేషన్ ఆఫీసర్), సీహెచ్.నరసింహారావు (డీపీఎం, డీఆర్‌డీఏ), గోపనబోయిన బ్రహ్మయ్య (కమ్యూనిటీ కో ఆర్డినేటర్, డీఆర్‌డీఏ), డాక్టర్ ఎం.ప్రదీప్‌కుమార్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఒంగోలు మెడికల్ కాలేజీ), ఎస్‌కే బాబ్జి (శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఒంగోలు నగరపాలకసంస్థ)


పి.వెంకటేశ్వరరావు (డీఎస్పీ, ఏఆర్), ఎండీ ఫిరోజ్ (సీఐ,గిద్దలూరు), జె.హరిబాబు (రిజర్వు ఇన్‌స్పెక్టర్), కె.వేణుగోపాల్ (ఎస్సై), వి.మహేష్ (ఎస్సై), ఎన్.రాగమయి (ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్), ఇ.అరుణకుమారి (ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్), కె.వెంకటరెడ్డి (జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్, బి.నాగభూషణం (సీఐ, సీఐడీ), వైవీ రవీంద్రమణి (ఎస్సై, సీఐడి), వి.మనోహర్ (ఎస్సై, సీఐడీ), డి.వంశీకృష్ణ (ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్), జె.అంకయ్య(ఎస్సై), కె.రామచంద్రరావు (ఎంవీఐ), పి.రవికుమార్ (ఎంవీఐ)

మహనీయులను నిత్యం స్మరించుకోవాలి

- వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవం

ఒంగోలు: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిలు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. పార్టీ కార్యాలయంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగఫలమే నేడు స్వేచ్ఛా వాయువులు పీల్చుకోగలుగుతున్నామన్నారు. స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను మనం నిత్యం స్మరించుకోవాలన్నారు. వారి అడుగుజాడల్లో నడవాలని యువతకు సందేశాన్ని ఇచ్చారు. రాజ్యాంగ స్ఫూర్తితో రాష్ట్రంలోని పేద, బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను అర్హులందరికీ అందేలా శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని తద్వారా వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, ఎంఎల్‌సీ తూమాటి మాధవరావు, నగర మేయర్ గంగాడ సుజాత, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, చాత్తాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్, ఏపీ టైలర్స్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ షేక్ సుభాన్‌బీ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు మార్నెళ్ల శ్రీదేవి శ్రీనివాస్(రజక కార్పోరేషన్), తిర్లిక శ్రీనివాసరావు(కృష్ణబలిజ), ధరణికోట లక్ష్మీనారాయణ(నాయీ బ్రాహ్మణ), గోనుగుంట రజని(విశ్వబ్రాహ్మణ), బొడ్డపాటి అరుణ(కమ్మ కార్పొరేషన్), చెరుకూరి చిన కాశయ్య(హస్తకళల), దాసరి కరుణాకర్(సూర్యబలిజ), షేక్ మహబూబ్(మైనార్టీ కార్పొరేషన్), బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్, రాష్ట్ర కార్యదర్శి గోలి తిరుపతిరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేవరపల్లి అంజిరెడ్డి, ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్, ట్రాన్స్‌కో మాజీ డైరెక్టర్ జిల్లెలమూడి రమాదేవి, ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి రవణమ్మ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, ఒంగోలు బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగరికంటి శ్రీనివాసులు, పీడీసీసీబ్యాంకు మాజీ చైర్మన్ కండే శ్రీనివాసరావు, మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.


జాతీయ జెండాను ఎగురవేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట, జంకె వెంకటరెడ్డి తదితరులు

ఐపీఎస్ రాకేష్‌రెడ్డికి ప్రతిష్టాత్మక అవార్డు

- గత ఏడాది అస్సాం డీజీపీ అవార్డు
- ఈ ఏడాది అస్సాం శిశుమిత్ర అవార్డు
- ఐపీఎస్ పీవీవీ రాకేష్‌రెడ్డికి ఎంపీ మాగుంట అభినందనలు



ఒంగోలు: తెలుగుతేజం అస్సాం ఐపీఎస్ పీవీవీ రాకేష్‌రెడ్డి వరుసగా రెండో ఏడాది కూడా అస్సాం ప్రభుత్వం జారీచేసిన ప్రతిష్టాత్మక అవార్డును కైవసం చేసుకున్నారు. రాకేష్‌రెడ్డి స్వగ్రామం మార్కాపురం. మార్కాపురంలోనే విద్యాభ్యాసం పూర్తిచేశారు. తండ్రి వీరారెడ్డి వయోజన విద్య రిటైర్డ్ ఆర్‌జేడీ. 2014 ఐపీఎస్ బ్యాచ్ అధికారి. అస్సాం రాష్ట్రం గోల్పార జిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారు. బంగ్లాదేశ్‌కు సరిహద్దుగా ఉన్న జిల్లా గోల్‌పర ప్రాంతంలో 12 మంది అల్‌ఖైదా ఉగ్రవాదులు ఉన్నట్లు సమాచారం రావడంతో వారిని చాకచక్యంగా అరెస్టు చేసినందుకు గాను అస్సాం ప్రభుత్వం గత ఏడాది అస్సాం డీజీపీ అవార్డును ప్రకటించింది. రాష్ట్రంలో బాలల హక్కులను కాపాడేందుకు, బాలలతో స్నేహపూర్వక పోలిసింగ్‌ను ప్రోత్సహించేందుకు తద్వారా ప్రజల్లో సుస్థిరమైన మార్పును తీసుకువచ్చేందుకు అస్సాం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 2019లో అస్సాం శిశుమిత్ర అవార్డును ఏర్పాటుచేసింది. పిల్లలు బాధ్యతాయుతమైన పౌరులుగా వికసించేలా చేసేందుకు బాలల వేధింపులు, వారిని కట్టు బానిసలుగా మార్చడం వంటి వాటిని నిరోధించేందుకు కృషిచేయడం దీని ముఖ్య ఉద్దేశం. పిల్లలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై కూడా కింది స్థాయి అధికారులకు అవగాహన కల్పించి పిల్లల మనస్తత్వంపై ఏయే అంశాలు ప్రభావితం చేస్తాయో గమనిస్తూ వారిని ఎలా తీర్చిదిద్దాలో కూడా వివరిస్తారు. ఈ అవార్డుకు రాకేష్‌రెడ్డికి ఎంపికైనట్లు అస్సాం పోలీస్ స్పెషల్ డీజీపీ అడ్మిన్ హర్మీత్‌సింగ్ ఒక లేఖ ద్వారా సమాచారంతో పాటు అభినందనలు తెలిపారు. ఈ అవార్డును శుక్రవారం బొంగైగావ్ జిల్లా గ్రంథాలయంలో అస్సాం రాష్ట్ర డీజీపీ భాస్కర్ జ్యోతి మహంత చేతుల మీదుగా రాకేష్‌రెడ్డి అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఐపీఎస్ రాకేష్‌రెడ్డిని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రత్యేకంగా అభినందనలు ప్రకటించారు. అస్సాం రాష్ట్రంలో తెలుగువారి కీర్తిని ఇనుమడింపజేసేలా పనిచేస్తుండడం గర్వంగా ఉందని కొనియాడారు.

ట్రాక్టర్ నుంచి జారి పడి మహిళ మృతి

రాచర్ల: మిరపకాయలు కోత పనులకు వెళుతున్న ట్రాక్టర్ పై నుండి ప్రమాదవశాత్తు మహిళ జారి కింద పడి మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని పలుగుంటిపల్లెలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే...పలుగుంటిపల్లె గ్రామానికి చెందిన పూల వెంకట సుబ్బామ్మ (35) గ్రామ సమీపంలోని పొలాల్లో మిరపకాయలు కోత కోసేందుకు ట్రాక్టర్‌పై బయలుదేరారు. ట్రాక్టర్ కొంత దూరం వెళ్లాగానే వెంకట సుబ్బామ్మ ప్రమాదవశాత్తు జారిపడి టైర్ కింద పడింది. ప్రమాదంలో సుబ్బామ్మకు తీవ్ర గాయాలు కాగా వెంటనే ప్రత్యేక వాహనంలో చికిత్స కోసం గిద్దలూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలికి భర్త, కూతురు ఉన్నారు.


వెంకట సుబ్బమ్మ మృతదేహం

ప్రతి పౌరుడు దేశ ప్రగతిలో పాలుపంచుకోవాలి

- జిల్లా జైలు పర్యవేక్షణాధికారి వరుణారెడ్డి

ఒంగోలు టౌన్: ప్రతి పౌరుడు దేశ ప్రగతిలో పాలుపంచుకోవాలని జిల్లా జైలు పర్యవేక్షణాధికారి పి.వరుణారెడ్డి అన్నారు. స్థానిక జిల్లా కారాగారంలో గురువారం 74వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన వరుణారెడ్డి మాట్లాడుతూ దేశం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు.ప్రతి ఒక్కరూ సత్యమార్గంలో పయనించాలని, సానుకూల దిశ ఆలోచనల వైపు జీవితాలను మార్చుకోవాలని ఖైదీలకు సూచించారు. అనంతరం జైలు సిబ్బందికి, ఖైదీలకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. జిల్లా సబ్ జైళ్ల అధికారి కె.వెంకటరెడ్డి, కారాగార వైద్యాధికారి ఎస్‌వీఎస్ బ్రహ్మతేజ, డిప్యూటీ జైలర్లు ఎస్.మల్లికార్జున రెడ్డి, కె.యలమందయ్య, చీఫ్ హెడ్ వార్డర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా జైలు పర్యవేక్షణాధికారి పి.వరుణారెడ్డి

గుళికల మందు తాగి
వ్యాపారి ఆత్మహత్య

గిద్దలూరు రూరల్ : అప్పుల బాధ తాళ లేక వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం మండలంలోని పాదలకుంటపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన కొప్పరపు శ్రీనివాసులు(47) అప్పుల బాధను భరించలేక గురువారం పొలాలకు వాడే గుళికల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

పుల్లలచెరువు: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలో నరజాముల తాండా సమీపంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. నరజాములతాండా సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టడంతో ఉసా చిన్నయోగయ్య, నాగేశ్వరరావునాయక్‌లకు తీవ్రంగా గాయపడ్డారు. చిన్నయోగయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. తీవ్రంగా గాయలైన నాగేశ్వరరావునాయక్ యర్రగొండపాలెం ప్రైవేట్ వైద్యశాలకు తరలించడంతో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


తేనీటి విందు
గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ బంగ్లాలో తేనీటి విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్, జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.